క్లుప్తంగా

ఘనంగా బీద మస్తాన్‌రావు జన్మదిన వేడుకలు



నెల్లూరు(వీఆర్సీసెంటర్): శాంతినగర్‌లోని నూర్‌బాషా జిల్లా కార్యాలయంలో రాజ్యసభ సభ్యుడు బీద మస్తాన్‌రావు జన్మదిన వేడుకలను సంఘ జిల్లా అధ్యక్షుడు సలీం ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్‌ను కట్ చేశారు. అనంతరం కొండాయపాళెం సమీపంలోని చైల్డ్ అండ్ పోలీస్ ప్రాజెక్ట్‌లో పిల్లలకు అన్నదానం చేశారు. నేతలు హుస్సేన్‌సాహెబ్, మస్తాన్, ఖాజావలీ, మౌలాలీ, షరీఫ్, చినమస్తానయ్య, సందానీ, ఖాదర్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

13న విద్యార్థులకు సత్కారం

నెల్లూరు(మినీబైపాస్): పదో తరగతిలో 450కుపైగా, ఇంటర్మీడియట్‌లో 750కుపైగా మార్కులను సాధించిన కుమ్మర, శాలివాహన విద్యార్థులను ఈ నెల 13న సత్కరించనున్నామని కుమ్మర శాలివాహన సంఘ నేతలు నరసయ్య, శ్రీనివాసులు మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అంబాపురంలోని కల్యాణ మండపంలో నిర్వహించనున్న కార్యక్రమానికి విద్యార్థులు హాజరుకావాలని కోరారు. వివరాలకు 95730 38716 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

డయేరియాపై అప్రమత్తత అవసరం

కొడవలూరు : అతిసార(డయేరియా) పట్ల అప్రమత్తంగా వ్యవహరించాలని యల్లాయపాళెం వైద్యాధికారిని కావ్య సూచించారు. మండలంలోని యల్లాయపాళెంలో స్థానిక పీహెచ్‌సీ ఆధ్వర్యంలో డయేరియాపై మంగళవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ డయేరియాను నిర్లక్ష్యం చేస్తే ప్రమాదకరంగా మారుతుందన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడంతో పాటు వ్యక్తిగత పరిశుభ్రత పాటించడం ద్వారా డయేరియాను పారదోలాలన్నారు. సురక్షితమైన నీటిని తాగడంతో పాటు పరిశుభ్రమైన, తాజా ఆహార పదార్థాలను తీసుకోవడం ద్వారా డయేరియాను దూరం చేయవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో పీహెచ్ఎన్ విజయ, హెచ్ఎస్‌లు సురేంద్ర, రజియ, ఎంఎల్‌హెచ్‌పీలు రోజ్‌మేరీ, జాస్మిన్, సౌమ్య, ఏఎన్ఎంలు సుకన్య, మహేశ్వరి, సుమతి, శాంతకుమారి, కీర్తి, మమత పాల్గొన్నారు.

ఎమ్మార్వో కాలనీలో..

పొదలకూరు : స్థానిక ఎమ్మార్వో కాలనీలో డయేరియా(వాంతులు, విరేచనాలు)పై ఆరోగ్యశాఖ సిబ్బంది మంగళవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఇంటింటి సర్వే నిర్వహించి గ్రూపు సమావేశాలు ఏర్పాటు చేశారు. కాచి చల్లార్చిన నీటిని సేవించాలని, వేడిచల్లారక ముందే భోజనం చేయాలని తెలిపారు. వాంతులు, విరేచనాలు ఉన్నవారు వెంటనే సమాచారం అందజేయాలని సూచించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

వెంకటాచలం : మోటార్ బైక్ అదుపుతప్పి పడడంతో ఓ వ్యక్తి గాయపడిన ఘటన మండలంలోని తాటిపర్తిపాళెం సమీపంలో కృష్ణపట్నం పోర్టు రోడ్డుపై మంగళవారం జరిగింది. గూడూరు పట్టణానికి చెందిన మురళీధర్ పని నిమిత్తం మోటార్ బైక్‌పై కృష్ణపట్నం వెళ్లాడు. తిరిగి గూడూరుకు వెళ్తుండగా తాటిపర్తిపాళెం సమీపంలో కారు అడ్డురావడంతో బైక్ అదుపుతప్పి పడింది. ఈ ప్రమాదంలో మురళీధర్‌కు గాయాలవ్వగా చికిత్స నిమిత్తం నెల్లూరుకు తరలించారు.

ప్రతిభావంతులకు అభినందన



కొడవలూరు : మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతిలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన విద్యార్థులకు నార్తురాజుపాళెం హైస్కూల్‌లో యూటీఎఫ్ ఆధ్వర్యంలో మంగళవారం అభినందన సభ నిర్వహించారు. మండలంలో ఆరు జెడ్పీ ఉన్నత పాఠశాలలుండగా, ప్రతి పాఠశాలలో మొదటి మూడు స్థానాలు సాధించిన ముగ్గురు వంతున 18 మంది విద్యార్థులను అభినందించారు. ప్రతి విద్యార్థికి జ్ఞాపిక, ప్రశంసా పత్రం అందజేశారు. ఈ సందర్భంగా యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పీవీ శేషు, జీవీ చలపతిశర్మ మాట్లాడుతూ యూటీఎఫ్ సామాజిక బాధ్యతలో భాగంగా విద్యార్థులను ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు. ప్రతి విద్యార్థి సామాజిక బాధ్యత కలిగిన పౌరులుగా మెలగాలని ఆకాంక్షించారు. ఎంఈఓలు జి.వసంతకుమారి, ఎన్.అంకయ్య, హైస్కూల్ హెచ్ఎంలు అన్నపూర్ణమ్మ, మోహన రామలింగయ్య, జి.శ్రీనివాసరావు, సంఘ జిల్లా కార్యదర్శి ఖాజావలి, మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సీహెచ్.మాలకొండయ్య, పి.తిరుపాలు పాల్గొన్నారు.

ఆలనాపాలనా కరువు



నాడు

ఎంతో సుందరంగా..



నేడు

బోసిపోయి దర్శనమిస్తూ..

- పార్కు నిర్వహణ గాలికి
- కళావిహీనంగా తయారైన వైనం
- నీరు పట్టకపోవడంతో ఎండిపోయిన మొక్కలు
- పట్టించుకోని నగరపాలక సంస్థ అధికారులు

నెల్లూరు(బారకాసు): ప్రజల ఆహ్లాదం కోసం నగరంలోని పలు ప్రాంతాల్లో పార్కులను కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. ఇదే తరహాలో ఐదో డివిజన్లోని సత్యనారాయణపురంలో ఎస్వీఆర్ స్కూల్ పక్కనే ఉన్న పార్కును ఎంతో సుందరంగా తీర్చిదిద్దారు. అయితే దీన్ని కొన్నాళ్ల పాటే పర్యవేక్షించారు. ఈ క్రమంలో ప్రస్తుతం పార్కు దయనీయంగా మారింది.

రూ.20 లక్షల కేటాయింపు

సత్యనారాయణపురంలోని పార్కు ఆధునికీకరణకు గత ప్రభుత్వ హయాంలో రూ.20 లక్షలను వెచ్చించారు. ఈ ఏడాది మార్చిలో పనులను ప్రారంభించి రెండు నెలల్లో పూర్తి చేశారు. పచ్చదనం కోసం పార్కు చుట్టూ మొక్కలను నాటడంతో పాటు పచ్చిక, వాకింగ్ ట్రాక్‌ను సైతం ఏర్పాటు చేశారు. చుట్టూ ప్రహరీ, గేట్లకు రంగులేసి ఎంతో సుందరంగా తీర్చిదిద్దారు. దీంతో తమ ప్రాంతంలోని పార్కు బాగుపడిందని ప్రజలు హర్షించినా, అది మూణ్ణాళ్ల ముచ్చటగా మిగిలింది.

దుర్భరంగా దర్శనమిస్తున్న వైనం

ఈ పార్కు ప్రస్తుతం కళావిహీనంగా మారింది. వాచ్‌మెన్‌ను ఏర్పాటు చేయకపోవడంతో రాత్రి వేళ మందుబాబులు ఇక్కడ మద్యాన్ని సేవిస్తున్నారు. సిమెంట్ బెంచీలు.. మోటార్.. నీటిని చిమ్మే పైపులను ధ్వంసం చేశారు. ఈ తరుణంలో పార్కులోని మొక్కలు, పచ్చిగడ్డికి నీరు పట్టే అవకాశం లేక అవన్నీ ఎండిపోయాయి. తినుబండారాలు, వాటర్ ప్యాకెట్లను ఇక్కడికి తీసుకొచ్చి పడేస్తుండటంతో అపరిశుభ్రంగా తయారైంది. సంబంధిత అధికారులు ప్రత్యేక దృష్టి సారించి వాచ్‌మెన్‌ను ఏర్పాటు చేయడంతో పాటు పార్కును సుందరంగా మార్చాలని స్థానికులు కోరుతున్నారు.



ఎండిపోయిన మొక్కలు

అధ్వానంగా తయారైంది



సత్యనారాయణపురంలోని పార్కును ఇటీవల ఎంతో సుందరంగా తీర్చిదిద్దారు. అయితే కొద్ది రోజులకే అధ్వానంగా తయారైంది. సిమెంట్ బల్లలను కొందరు ధ్వంసం చేశారు. పార్కుకు పూర్వవైభవం తీసుకొచ్చేలా అధికారులు చర్యలు చేపట్టాలి.

– ప్రసాద్‌రెడ్డి, సత్యనారాయణపురం

నిర్వహణను విస్మరించడంతోనే..



పార్కులో అపరిశుభ్రత నెలకొంది. పార్కు నిర్వహణను పట్టించుకున్న దాఖలాల్లేవు. ఆధునికీకరించిన కొద్ది రోజులకే ఈ దుస్థితికి చేరుకోవడం దారుణం. పార్కు నిర్వహణపై అధికారులు దృష్టి సారించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

– వెంకటరత్నం, సత్యనారాయణపురం

లైన్ ఇన్‌స్పెక్టర్ బాధ్యతల స్వీకరణ



షరీఫ్‌ను అభినందిస్తున్న అల్తాఫ్

నెల్లూరు(వీఆర్సీసెంటర్): ఎస్పీడీసీఎల్ లైన్ ఇన్‌స్పెక్టర్ (ఎల్ఐ)గా షరీఫ్ బాధ్యతలను మంగళవారం స్వీకరించారు. వెంకటేశ్వరపురం సబ్‌స్టేషన్లో ఎల్ఐగా విధులు నిర్వర్తిస్తున్న శివరామకృష్ణ ఇటీవల ఉద్యోగ విరమణ పొందారు. ఈ క్రమంలో ఏకేనగర్ సబ్‌స్టేషన్లో విధులు నిర్వర్తిస్తున్న షరీఫ్‌ను ఇక్కడ నియమించారు. కాగా షరీఫ్‌కు అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్(ట్రాన్స్‌ఫార్మర్స్) అల్తాఫ్ తదితరులు అభినందనలను తెలియజేశారు.

‘రెయిన్‌బో’లో అరుదైన శస్త్రచికిత్స



మాట్లాడుతున్న వైద్యులు

నెల్లూరు(అర్బన్): యువకుడి భుజంలో ఏర్పడిన అత్యంత అరుదైన కేన్సర్ గడ్డను ఆపరేషన్ ద్వారా తొలగించామని రెయిన్‌బో స్పెషాల్టీ ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్ సునీల్‌కుమార్, ఆర్థోపెడిక్ అంకాలజిస్ట్ అనిల్ చౌదరి పేర్కొన్నారు. రోగి దుర్గాప్రసాద్‌తో కలిసి నగరంలోని ఆస్పత్రిలో విలేకరుల సమావేశంలో మంగళవారం వారు మాట్లాడారు. చీరాలకు చెందిన 27 ఏళ్ల దుర్గాప్రసాద్ కుడి భుజంపై గడ్డ వచ్చి వేగంగా పెరిగిందని చెప్పారు. ఎమ్మారై చేయించుకొని గుంటూరు, హైదరాబాద్‌లోని కార్పొరేట్ ఆస్పత్రులను ఆశ్రయించారని తెలిపారు. కేన్సర్ గడ్డ రక్తనాళానికి అతుక్కొని ఉండటంతో అత్యంత రిస్క్‌తో కూడిన ఆపరేషన్ అని చెప్పారన్నారు. తెలిసిన వారి ద్వారా సదరు యువకుడు తమ ఆస్పత్రికి వచ్చారని, అగ్రెసివ్ టెండాన్ షీత్ ఫైబ్రోమా అనే అరుదైన కేన్సర్ గడ్డ రక్తనాళానికి అతుక్కొని ఉండటాన్ని గుర్తించామని పేర్కొన్నారు. కేసును ఛాలెంజ్‌గా తీసుకొని ఐదు గంటలకుపైగా ఆపరేషన్ చేసి యువకుడి ప్రాణాలను కాపాడామని చెప్పారు. రోగి కోలుకున్నారని, డిశ్చార్జ్ చేయనున్నామని వివరించారు. ఆరోగ్యశ్రీ ద్వారా ఆపరేషన్‌ను ఉచితంగా చేశామని పేర్కొన్నారు.

రాహుల్ గాంధీ దిష్టిబొమ్మ దహనం



నెల్లూరు(మినీబైపాస్): హిందువులను ఉద్దేశించి పార్లమెంట్‌లో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ చేసిన అభ్యంతరకర వ్యాఖ్యలను ఖండిస్తూ నగరంలోని వీఆర్సీ సెంటర్‌లో నిరసనను బీజేవైఎం నేతలు మంగళవారం చేపట్టారు. రాహుల్ గాంధీ దిష్టిబొమ్మను దహనం చేశారు. బీజేపీ నేత మిడతల రమేష్, బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు గుత్తా అశోక్‌నాయుడు, ప్రధాన కార్యదర్శులు నరేష్, తాళ్లూరు నవీన్‌కుమార్, ఉపాధ్యక్షుడు వెంకటసాయికృష్ణ యాదవ్, కార్యదర్శి కృష్ణసాయినాయుడు, పార్టీ రాష్ట్ర కార్యదర్శి కందికట్ల రాజేశ్వరి, కార్యవర్గ సభ్యుడు గుండ్లవల్లి భరత్‌కుమార్‌యాదవ్ పాల్గొన్నారు.

నిబంధనలు తుంగలో..



పరిమితికి మించి ప్రయాణికులను ప్రమాదమని తెలిసినా వాహనదారులు పట్టించుకోవడం లేదు. నిబంధనలను యథేచ్ఛగా తుంగలో తొక్కుతున్నారు. కొండాయపాళెం గేట్, ఎంజీబీ మాల్ సెంటర్, ఎస్పీ కార్యాలయానికి కూతవేటు దూరంలోని సబ్‌స్టేషన్ ఎదురు నుంచి భవన నిర్మాణ కూలీలను టాటా ఏస్ వాహనాల్లో పరిమితికి మించి తరలిస్తున్నారు. వీటిపై పోలీస్, రవాణా శాఖ అధికారులు చర్యలు చేపట్టకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

– నెల్లూరు(క్రైమ్)

ప్రమాద ఘటనపై దిగ్భ్రాంతి

నెల్లూరు(దర్గామిట్ట): కావలి సమీపంలోని ముసునూరు టోల్‌ప్లాజా వద్ద ఆరెస్సార్ ఇంటర్నేషనల్ స్కూల్ బస్సు ప్రమాద ఘటనపై ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. క్లీనర్ మృతి చెందడం బాధాకరమన్నారు. ప్రమాదంలో 13 మంది చిన్నారులు గాయపడటం ఆందోళనకు గురిచేసిందని పేర్కొన్నారు. బాధితులకు అండగా ఉంటామని చెప్పారు.

కుక్కల బెడదను తొలగించాలి

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): నగరంలోని 17వ డివిజన్లో గల చిల్డ్రన్స్ పార్కులో పిచ్చి కుక్క స్వైర విహారం చేయడంతో పలువురు వాకర్స్ సోమవారం గాయపడ్డారు. ఈ క్రమంలో మంత్రి నారాయణ స్పందించారు. పార్కులో కూలిపోయిన ప్రహరీ కారణంగా కుక్కలు ప్రవేశిస్తున్నాయని, దీన్ని వెంటనే నిర్మించాలని సూచించారు. కార్పొరేషన్ పరిధిలో కుక్కల బెడదను తొలగించడంతో పాటు యాంటీ బర్త్ కంట్రోల్ ఆపరేషన్లను చేపట్టాలని ఆదేశించారు.

మహిళల సంరక్షణకే వెల్ఫేర్ ఫౌండేషన్



నెల్లూరు(బృందావనం): నిస్సహాయులైన మహిళల సంరక్షణ కోసమే దిశ ప్రొటెక్షన్ వెల్ఫేర్ ఫౌండేషన్‌ను ఏర్పాటు చేశామని ఫౌండర్ చైర్మన్ వెంకటేశ్వరరాజు పేర్కొన్నారు. పురమందిర ప్రాంగణంలోని వర్ధమాన సమాజ హాల్లో మంగళవారం నిర్వహించిన ఫౌండేషన్ జిల్లా కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఫౌండేషన్‌ను నాలుగేళ్ల క్రితం ఏర్పాటు చేశామని చెప్పారు. తమ దృష్టికి వచ్చిన మహిళల సమస్యలపై తక్షణమే స్పందిస్తున్నామని వివరించారు. అనంతరం ఆయన్ను సత్కరించారు. ఫౌండేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు మల్లెం విమల, జిల్లా అధ్యక్షురాలు నిర్మలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్‌లో ఉన్న జాబితాను పంపరూ..



డీఆర్వోకు వినతిపత్రమిస్తున్న రమేష్

నెల్లూరు (దర్గామిట్ట): కండలేరు జలాశయానికి సంబంధించిన ముంపు నిరుద్యోగుల రోస్టర్ పాయింట్ల వేకెన్సీ జాబితా కలెక్టర్ కార్యాలయంలో ఎన్నికల కోడ్ కారణంగా పెండింగ్‌లో ఉండిపోయిందని, దీన్ని వెంటనే సచివాలయానికి పంపాలని బీజేపీ నేత మిడతల రమేష్ కోరారు. ఈ మేరకు డీఆర్వో లవన్నకు వినతిపత్రాన్ని మంగళవారం సమర్పించారు.

నేత్రపర్వంగా పుష్పయాగం



పూజలు చేస్తున్న వేదపండితులు



చక్రస్నానం

నెల్లూరు(బృందావనం): వేదాయపాళెంలోని అయ్యప్ప దేవస్థాన ప్రాంగణంలో గల మహాలక్ష్మి గోదా సమేత గురువాయూర్ మహావిష్ణు ఆలయంలో నిర్వహిస్తున్న బ్రహ్మోత్సవాలు పుష్పయాగంతో మంగళవారం ముగిశాయి. భద్రాచలంలోని సీతారామస్వామి దేవస్థాన స్థానాచార్యుడు కొమాండూరు ఇళయవిల్లి స్థలశాయి ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలను నిర్వహించారు. ధ్వజావరోహణ, మహాకుంభప్రోక్షణ, ఏకాంతసేవను రాత్రి జరిపారు. ఉభయకర్తలుగా చల్లా చైతన్యకుమార్‌రెడ్డి, శిరీష దంపతులు వ్యవహరించారు. అయ్యప్ప సేవా సమాజ అధ్యక్ష, కార్యదర్శులు గూడల శేషగిరిరావు, వెంకటరత్నం, కోశాధికారి రత్నయ్య, శంకర్, మోహన్‌రావు తదితరులు పర్యవేక్షించారు.

మర్యాదపూర్వకంగా..



నెల్లూరు (దర్గామిట్ట): కలెక్టర్ హరినారాయణన్‌ను కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి మర్యాదపూర్వకంగా మంగళవారం కలిశారు. వివిధ అంశాలపై కలెక్టర్‌తో చర్చించారు. నియోజకవర్గానికి సంబంధించిన పలు సమస్యలను తెలియజేశారు. సమస్యలను పరిష్కరించేలా చర్యలు చేపడతామని కలెక్టర్ హామీ ఇచ్చారు.

సహకార దినోత్సవ పోస్టర్ల ఆవిష్కరణ



నెల్లూరు(వీఆర్సీసెంటర్): అంతర్జాతీయ సహకార దినోత్సవానికి సంబంధించిన పోస్టర్లను జేసీ, డీసీసీబీ పర్సన్ ఇన్‌చార్జి సేదు మాధవన్ మంగళవారం ఆవిష్కరించారు. తన చాంబర్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. అంతర్జాతీయ సహకార దినోత్సవాన్ని ఈ నెల ఆరున నిర్వహించనున్నామని చెప్పారు. జిల్లాలోని అన్ని సహకార సంఘాల్లో కార్యక్రమాలను నిర్వహించాలని సూచించారు. డీసీఓ గుర్రప్ప, డీసీసీబీ సీఈఓ శ్రీనివాసరావు, “ ఎసహకార శాఖ విద్యాధికారి గోగుల శ్రీనివాసులు పాల్గొన్నారు.

బడి ఈడు పిల్లలను పాఠశాలల్లో చేర్పించాలి



విద్య ఆవశ్యకతపై అవగాహన

నెల్లూరు (టౌన్): బడి ఈడు పిల్లలను పాఠశాలల్లో చేర్పించాలని సమగ్ర శిక్ష రాష్ట్ర పరిశీలకులు శారద తెలిపారు. నగరంలోని దీన్‌దయాళ్‌నగర్‌లో ర్యాలీని పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు మంగళవారం నిర్వహించి విద్య ఆవశ్యకతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించాలని కోరారు. ఉప తనిఖీ అధికారి ఖాజామొహిద్దీన్, ప్రత్యామ్నాయ పాఠశాలల జిల్లా సమన్వయకర్త సుబ్రహ్మణ్యం, సీఎంఓ పెంచలయ్య, ఐటీడీఓ ఎంఓ శాంతి తదితరులు పాల్గొన్నారు.

ఏపీజేయూ జిల్లా నూతన కమిటీ నియామకం



నెల్లూరు(బారకాసు): ఆంధ్రప్రదేశ్ జర్నలిస్టుల యూనియన్ (ఏపీజేయూ) జిల్లా నూతన కమిటీని నియమించామని యూనియన్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కాకుమాను వెంకటవేణు తెలిపారు. ఈ మేరకు బాలాజీనగర్‌లోని యూనియన్ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లా గౌరవాధ్యక్షుడిగా ద్వారం వేణుగోపాల్‌రెడ్డి, గౌరవ సలహాదారుడిగా రామచంద్రమూర్తి, జిల్లా అధ్యక్షుడిగా మనాపాటి చక్రవర్తి, ప్రధాన కార్యదర్శి గగ్రే వెంకటేశ్వర్లు, కోశాధికారిగా మదన్, ఉపాధ్యక్షుడిగా మురళీమోహన్, సంయుక్త కార్యదర్శిగా యాదాల కృష్ణకిషోర్‌ను నియమించామని పేర్కొన్నారు. జిల్లాలోని జర్నలిస్టుల సమస్యల పరిష్కారం, సంక్షేమానికి కమిటీ పనిచేయాలని సూచించారు. ఏపీజేయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శేఖర్‌బాబు, ఉపాధ్యక్షుడు విష్ణువర్ధన్ పాల్గొన్నారు.

కృష్ణ కథామృత భాగవత సప్తాహం



లక్ష్మీనరసింహరావును సత్కరిస్తున్న నిర్వాహకులు

నెల్లూరు(బృందావనం): బాలాజీనగర్‌లోని సీతారామస్వామి మందిరంలో పద్యసారస్వత పరిషత్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కృష్ణ కథామృత భాగవత సప్తాహం మంగళవారంతో ముగిసింది. ఈ సందర్భంగా రుక్మిణీ కల్యాణం అంశంపై పండితుడు పోలవరపు లక్ష్మీనరసింహరావు ఉపన్యసించారు. సభాపోషకులుగా సుబ్బు శ్రీనివాస్, మాధవి వ్యవహరించారు. అనంతరం లక్ష్మీనరసింహరావును సత్కరించారు. పద్యకళాపరిషత్ అధ్యక్షుడు మెట్టు రామచంద్రప్రసాద్, డాక్టర్ చీమకుర్తి వెంకటేశ్వరరావు, నలుబోలు బలరామయ్యనాయుడు, అగస్త్యరాజు సుబ్బారావు, చంద్రశేఖరం, కోట రాజశేఖర్, జయప్రసాద్, సమయానందనాథ స్వామి, దేవరకొండ మురళీకృష్ణ, కోట శ్రీరామ్మూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పనులను ఆపొద్దు



నెల్లూరు(వీఆర్సీసెంటర్): రాజకీయ కారణాలతో గ్రామాల్లో ఉపాధి పనులను నిలపొద్దని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘ జిల్లా కార్యదర్శి పుల్లయ్య కోరారు. నగరంలోని రామచంద్రారెడ్డి భవన్‌లో ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘ జిల్లా కమిటీ సమావేశాన్ని జిల్లా అధ్యక్షుడు జొన్నలగడ్డ వెంకమరాజు అధ్యక్షతన మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పుల్లయ్య మాట్లాడారు. జిల్లాలో వ్యవసాయ పనుల్లేక వ్యవసాయ కూలీలు అనేక ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. వ్యవసాయ కూలీలకు ఆసరాగా ఉన్న ఉపాధి పనులు రెండు నెలలుగా సక్రమంగా జరగడంలేదని తెలిపారు. గతంలో ఉన్న ఫీల్డ్ అసిస్టెంట్లను రాజకీయ కారణాలతో నిలిపేశారని, ఈ తరుణంలో కూలీలకు పనులు కరువయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. నేతలు మాల్యాద్రి, పెద్దబ్బయ్య, నాగమ్మ, కాంతారావు, విజయ్‌కుమార్, రమణయ్య, నాగయ్య, రమణయ్య, ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.